క్లుప్తంగా

విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ

భట్టిప్రోలు: విద్యార్థుల్లో అనీమియాతో సహా ఐరన్ లోపాన్ని నిరోధించడానికి వారంలో రెండు రోజులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐరన్ మాత్రలను అందిస్తున్నారు. గురువారం భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు తో ఐరన్ మాత్రలు పంపిణీ చేయించారు.

పోషక లోపాల నివారణపై దృష్టి పెట్టాలి



కొల్లూరు: పోషకాహార లోపం కారణంగా అనారోగ్య సమస్యలు అధికమయ్యే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో పోషకాహార లోపాలను అధిగమించడంపై గర్భిణులు, బాలింతలు దృష్టి సారించాలని ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్ వైజర్ నగరాజకుమారి అన్నారు. గురువారం మండలంలోని పోతార్లంకలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కోనేటిపురంలో నాగదేవతకు పూజలు

కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం గ్రామంలో కొలువైన వేంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నాగదేవతకు గురువారం పూజలు నిర్వహించారు. సామూహిక పూజా కార్యక్రమాలలో పలువురు దంపతులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ కానుకల లెక్కింపు



పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంవీఎస్ వర్మ మాట్లాడుతూ మొత్తం రూ.3,94,535 ఆదాయం లభించినట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి హాజరయ్యారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

రేపల్లె రూరల్: అధికారుల వైఫల్యంతోనే రెండు కుటుంబాలలో విషాదఛాయలు అలుముకున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పడమటి విజయ్‌కుమార్, కొండేటి వెంకటేశ్వరరావుల కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నియోజకవర్గంలో నిమజ్జనలు చేసే ప్రదేశాలలో ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా అధికారులతో నిఘా ఏర్పాటు చేయటంతో పాటు గజఈతగాళ్లను నిరంతరం ఉంచాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, ఆశీర్వాదం, రమేష్, అగస్టీన్, తులసీరాముడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

వేమూరు: పంట కాలువలో క్రేన్‌తో తుటి కాడ తొలగిస్తుండగా గుర్తు తెలియని మృతదేహం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం బలిజేపల్లి గ్రామం పంట కాలువలో తుటికాడ అధికంగా ఉండటంతో ఇరిగేషన్ అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. గురువారం బలిజేపల్లి నుంచి చావలి మార్గంలో నాగేంద్ర స్వామి పుట్టకు ఎదురుగా ఉన్న పంట కాలువలో తుటి కాడ తొలగిస్తుండగా మృతదేహం కనిపించడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా గుర్తు తెలియని పరిస్థితిలో ఉందని రైటర్ ప్రసాద్ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

బాపట్లటౌన్: వైద్యాధికారి ద్విచక్ర వాహనం చోరీకు గురైన ఘటన పట్టణంలోని ఏరియా వైద్యశాలలో చోటుచేసుకుంది. మండలంలోని నరసాయపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారిగా విధులు నిర్వర్తించే డాక్టర్ ఎల్.పవన్ చైతన్య బుధవారం విధుల్లో భాగంగా పట్టణంలోని ఏరియా వైద్యశాలకు వచ్చారు. ఏరియా వైద్యశాలలో పనులు ముగించుకొని వచ్చేచూసే సరికి పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకు గురైంది. వైద్యాధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ షేక్ రఫీ కేసు నమోదు చేశారు.

షాపు వివాదంలో వ్యక్తిపై దాడి

బాపట్లటౌన్: షాపు వివాదంలో వ్యక్తిపై దాడి చేసిన ఘటన పట్టణంలోని పటేల్‌నగర్ 1వ లైన్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణానికి చెందిన నామన కోటేశ్వరరావు పై షాపు విషయంలో దేవర అచ్యుత్ దాడి చేశారు. బాధితుడు కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ షేక్ రఫీ కేసు నమోదు చేశారు.

గణనాథుని ఆశీస్సులు ఉండాలి



అద్దేపల్లిలో గణనాథుడిని ఊరేగింపు



భట్టిప్రోలు భోగేశ్వరపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులు, యువత

భట్టిప్రోలు: గణనాథుని ఆశీస్సులు రాష్ట్రానికి అన్ని విధాలుగా ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని గ్రేస్ ఫౌండేషన్ ఏపీ ఇన్‌చార్జి యన్నం సురేష్ ఆకాంక్షించారు. భట్టిప్రోలులోని భోగేశ్వరపేటలో నిర్వహించిన గణపతి మహోత్సవాలకు ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్ రాజు విగ్రహాన్ని అందజేశారు. గురువారం జరిగిన పూజా కార్యక్రమాలలో సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మర్రి గురుమహేష్, ఏసు యాదవ్, కంభం సురేష్, యన్నం కార్తీక్, మోర్ల ప్రవీణ్, ఆదిన హరికృష్ణ, చింతక్రింద గిరి, కుక్కల మహేష్, గోపి పాల్గొన్నారు. స్వామి వారి విగ్రహాన్ని కనకతప్పెట్లు, మేళతాళాలు, ఆనందోత్సాహాల మధ్య గురువారం నిమజ్జనం చేశారు.

అద్దేపల్లిలో..

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి రామాంజనేయ నగర్ ఎస్టీ కాలనీలో రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని గురువారం నిమజ్జనోత్సవం చేశారు. బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, పెద్దలు కనక తప్పెట్లు, కర్రసాము, మహిళలు నృత్యాలు చేస్తూ విగ్రహాన్ని అద్దేపల్లి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దేపల్లి వంతెన వద్ద నిమజ్జనోత్సవం చేశారు. వినాయకుని లడ్డూను గ్రామానికి చెందిన ఇళ్లా కృష్ణయ్య రూ.14,400లకు వేలం పాటలో దక్కించుకున్నారు. పూజా కార్యక్రమాలను దారా సూరిబాబు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, నిర్వాహకులు దేవరకొండ ఆదియ్య పాల్గొన్నారు.

బస్టాండ్ సెంటర్‌లో..


భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద లక్ష్మీ గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కారంపూడి కోటిలింగం-కల్యాణి దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సమారాధనలో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. ఆదివారం స్వామి వారి లడ్డు పాట, నిమజ్జనోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వెల్లటూరు, పెదపులివర్రులలో...

భట్టిప్రోలు మండలం వెల్లటూరులో కొలువైన సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. పెదపులివర్రులోని బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో గణపతి స్వామికి గత నాలుగు రోజులుగా గణపతి హోమం నిర్వహిస్తున్నారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

సామూహిక ధనలక్ష్మీకి పూజలు

బాపట్ల: వినాయక నవరాత్రులు సందర్భంగా బాపట్ల నియోజకవర్గంలో నాలుగో రోజులు అత్యంత వైభవంగా వినాయకుని మండపాలు వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. బాపట్లలోని శ్రీక్షీరభావనారాయణస్వామి దేవాలయంలో శ్రీసంపత్ గణపతి ఆధ్వర్యంలో సామూహిక ధన లక్ష్మీ పూజలను నిర్వహించారు. స్థానిక భీమావారిపాలెంలోని రామాలయంలో, స్థానిక పార్కు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని మండపాలు వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను వేలంలో గోపినాథ్ రూ.19 వేలకు సొంతం చేసుకున్నారు.



మహాలక్ష్మీ చెట్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు



బాపట్లలో విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగింపుగా తరలిస్తున్న భక్తులు



శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో సంపత్ గణపతి నవరాత్రులు సందర్భంగా సామూహిక ధనలక్ష్మీ పూజలు

భయం వద్దు.. క్యాన్సర్‌కు ఉంది ఆన్సర్

- నేడు వరల్డ్ రోజ్ డే
- క్యాన్సర్ బాధితులకు భరోసా కల్పిస్తూ ఏటా వేడుకలు
- గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు
- ఉచితంగా ఆపరేషన్లు
- ఆధునిక చికిత్సలతో క్యాన్సర్ నివారణ

క్యాన్సర్ ... ఈ వ్యాధి పేరు చెబితేనే చాలా మందికి ఒంట్లో వణుకు పుట్టుకొస్తుంది. వస్తే చనిపోవడమే అనే అపోహల్లో ప్రజలు ఉన్నారు. పూర్వం రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. వ్యాధిగ్రస్తుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ఏటా ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 22న రోజ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. – గుంటూరు మెడికల్

రోజ్ డే నేపథ్యం

కెనడా దేశానికి చెందిన 12 ఏళ్ల మెలిండా రోజ్ 1994లో క్యాన్సర్ వ్యాధికి గురైంది. అది కూడా చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్ అవ్వడం, కొన్ని వారాల్లోనే బాలిక చనిపోతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కాని రోజ్ ఎలాంటి బాధ లేకుండా, భయపడకుండా ఆస్పత్రిలో ఉన్న రోగులకు రోజా పువ్వులు అందించి, వారికి కవితలు వినిపించి, మనో ఉల్లాసాన్ని కలిగించింది. ఈ విధంగా ఆరునెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగుల్ని చిరునవ్వుతో పలుకరిస్తూ ఉత్తరాలు రాస్తూ వారిని ఆనందింపజేసి సెప్టెంబరు 22న మరణించింది. ఆ బాలిక జ్ఞాపకార్థం ఏటా రోజ్‌డేను నిర్వహిస్తున్నారు.

క్యాన్సర్ రోగులకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగానే పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నారు. వైద్య రంగంలో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనేక సంస్కరణలు చేశారు. ముఖ్యంగా క్యాన్సర్ రోగులకు ఆయన పెద్ద భరోసా కల్పిస్తూ ప్రొసీజర్స్ పెంచారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 2019 వరకు రోగులకు 223 ప్రొసీజర్స్‌కు మాత్రమే చికిత్స అందించారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 648 ప్రొసీజర్స్‌కు ఉచితంగా చికిత్స అందిస్తూ పెద్ద భరోసా కల్పించింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2019 నుంచి 2023 ఆగస్టు వరకు మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ వైద్య విభాగాల ద్వారా జిల్లాలో నాలుగేళ్లలో 14,626 మందికి ఉచితంగా చికిత్స అందించారు. క్యాన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడేందుకు పలు రకాల చికిత్సల కోసం ప్రభుత్వం రూ.117.47 కోట్లు ఖర్చు చేసింది.





లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరం

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సుమారు రూ. 45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేశాం. ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. కోట్ల రూపాయలు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీ థెరపీ, సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలు ప్రభుత్వం అందజేసింది. తాజాగా పెట్ స్కాన్ పరికరం మంజూరు చేసింది. మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్, న్యూక్లియర్ మెడిసిన్, రేడియోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నాం. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి సైతం ప్యాలేటీవ్ కేర్ చికిత్సలు ఉచితంగా ఇళ్లకు వెళ్లి అందిస్తున్నాం. మందులు కూడా ఉచితంగా అందించి క్యాన్సర్ రోగుల్లో మనోధైర్యం కల్పిస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్

క్యాన్సర్ కారణాలు

- ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగం
- సిగరెట్, బీడీ, చుట్ట, పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా వస్తుంది.
- మద్యపానం
- వ్యాయామం చేయకపోవడం
- ఆకుకూరలు తినకపోవడం
- ఊరగాయపచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినడం
- అధిక బరువు

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- తొమ్మిది మందిపై కేసు నమోదు

కొల్లూరు: వినాయక నిమజ్జనంలో ఘర్షణలో ముగ్గురు గాయపడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కొల్లూరు బైపాస్ రోడ్డులో యువకులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనోత్సవ కార్యక్రమం చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో వినాయకుడి విగ్రహం ఊరేగింపు జరుగుతున్న సమయంలో సినిమా పాటలు వేసే విషయంలో మరో సామాజిక వర్గంకు చెందిన యువకులు, గణేషుడి ప్రతిమ ఏర్పాటు చేసిన యువకుల నడుమ ఘర్షణ చెలరేగింది. కొట్లాటలో ఈమని వరప్రసాద్, ఈమని కాళీకృష్ణభార్గవ, ఈమని కిశోర్ అనే యువకులకు గాయాలవడంతో స్థానికుల సహకారంతో పోలీసులు తెనాలి వైద్యశాలకు తరలించారు. అనంతరం యువకులపై దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకోవాలని గాయాలకు గురైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు పెద్ద ఎత్తున పోలీసు స్టేషన్‌కు చేరుకోవడంతో, ఎస్ఐ రాజ్యలక్ష్మి దాడికి పాల్పడిన యువకులను ఉపేక్షించబోమని కేసులు నమోదు చేస్తామని నచ్చచెప్పడంతో ఉద్రిక్తత సర్దుమణిగింది. యువకులపై దాడికి పాల్పడిన తొమ్మిది మంది యువకులైన పడమటి నాగబాబు, పడమటి జనార్దన్, అనగాని మహేష్, అనగాని రాజేష్, ఉయ్యూరు ప్రసాద్, మట్టా చందు, జంపాని రామయ్య, జోగి సాయిసన్నీ, కొంతి భాను ప్రకాష్‌లపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వై.అర్జున్ కేసు నమోదు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

వేమూరు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల్లో ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబాల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం ప్రజలకు వైద్యం ఆర్థిక భారం కాకుండ ఉండేందుకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలు అందిస్తోందని వైద్యులు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలని సర్వే సిబ్బందికి ఆదేశించడం జరిగిందని వైద్యులు తెలిపారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం మండలంలోని వెల్లటూరు, భట్టిప్రోలు పీహెచ్‌సీలలో ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం అద్దేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్‌ఓలు, హెచ్‌ఎస్‌లు, హెచ్‌వీలు, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు.

దిండి పంచాయతీలో..

నిజాంపట్నం: ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్నట్లు కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ మురళి తెలిపారు. మండలంలోని దిండి పంచాయతీ నర్రావారిపాలెంలో గురువారం ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పరీక్షలు నిర్వహించారు.



అమృతలూరు మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



నర్రావారిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ మురళి

కళాశాల అభివృద్ధికి డాక్టర్ నాదెళ్ల సేవలు మరువలేనివి

డాక్టర్ వీరరాఘవయ్య

నగరం: స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాల అభివృద్ధికి డాక్టర్ నాదెళ్ల వెంకటకృష్ణారావు చేసిన సేవలు మరువలేనివని డాక్టర్ వసంతం వీరరాఘవయ్య చెప్పారు. కళాశాలలో గురువారం వెంకటకృష్ణారావు సంసర్మణ సభ నిర్వహించారు. వీరరాఘవయ్య మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపక సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా నాదెళ్ల వెంకటకృష్ణారావు పనిచేశారన్నారు. తీరప్రాంత ప్రజలకు ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో కళాశాల స్థాపనకు కృషి చేసినట్లు చెప్పారు. తొలుత ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వీరరాఘవయ్య

డిజిటల్ లిటరసీలో నైపుణ్య శిక్షణ

బాపట్ల: బాపట్ల బీ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు పీఎం గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ కింద డిజిటల్ లిటరసీలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు సంస్థకు సంబంధించి అవగాహన ఒప్పందాలు చేసుకోవటం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ లిటరసీ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలతో..

బాపట్ల అర్బన్: ఈ గవర్నెన్స్ సర్వీసెస్ ఇండియా, భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల సాంకేతిక పరమైన ఒప్పందాలు చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలతో విద్యార్థులకు సాంకేతికపరమైన విషయాలపై శిక్షణ ఇచ్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు విద్యార్థులందరికీ ఇన్ఫోసిస్ సిగ్నేచర్ బోర్డ్ అనే ప్లాటఫార్మ్ ద్వారా అత్యాధునికమైన కంప్యూటర్ కోర్సులు, ఎలక్ట్రానిక్ కోర్సులు అందించేందుకు అవకాశం ఉందని తెలిపారు. కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్ బాబు మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందాలు విద్యార్థులకు విజ్ఞానం అభివద్ధి, సమాజ సేవా దృక్పథంతో ముందుకుపోయేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌సీ ఈ గవర్నెన్స్ అధికారి వై. రామమోహన్‌రావు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న బీ ఫార్మసీ కళాశాల ప్రతినిధులు

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

తెనాలి అర్బన్: ఇండియన్ స్వచ్ఛత లీగ్ ప్రోగ్రాంలో భాగంగా తెనాలి పట్టణంలోని 2,3 శానిటరీ డివిజన్‌లలో పనిచేసే 70మంది పారిశుద్ధ్య కార్మికులకు గురువారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీజాన్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ నిత్యం వ్యర్థాల్లో గడిపే కార్మికులకు వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, షేక్ బాజీ హుస్సేన్, ఎం.సుబ్బారావు, వై.అనుపమ, శానిటేషన్ సెక్రటరీలు బి.శ్రావణి, జి.దివ్య, ఎ.జ్యోత్స్న, కె.పాల్, డి.మురళీధర్, కె.ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బీబీజాన్

యోగాతో ఆరోగ్యకర జీవనం

తెనాలి అర్బన్: యోగాతో ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పిన్నక శేషభానురావు మెమోరియల్ ఉచిత యోగా శిక్షణ తరగతుల్ని గురువారం టూటౌన్ పోలీసుస్టేషన్ సమీపంలోని నారాయణ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. క్లబ్ యోగా చైర్‌పర్సన్ కందిమళ్ల స్వప్న యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యోగా గురువు నాగం వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ జీవన్‌లత, జి.వి.నారాయణ, ఈదర పూర్ణచంద్, యశ్వంత్ పాల్గొన్నారు.



యోగా నేర్పిస్తున్న స్వప్న

ప్రజల స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలి

తెనాలి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుతో అధికార, ప్రతిపక్ష పార్టీలు సాధారణ ప్రజల స్వేచ్ఛకు ఎలాంటి భంగం వాటిల్లకుండా తమ కార్యక్రమాల్ని జరుపుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సూచించారు. సంస్థ స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా తగు చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆరే మరిదాసు, సభ్యులు మహేష్, కోటేశ్వరరావు, జానీ మాస్టర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్నాటి నాగరాజు